# నిజం నిలకడమీద తెలుస్తుంది

రచన : శ్రీకృష్ణ

(గతసంచిక తరువాయి)

అక్కడ యర్రబాలెం గ్రామంలో రంగారెడ్డి, పార్వతమ్మ - సావిత్రి వెళ్ళిపోయిననాటినుండి దిగులుతో కుమిలి పోసాగేరు.

పనిమనిషి చంద్రమ్మ తన కొడుకు కనిపించలేదని కుమిలి పోగానీంది.

పార్వతమ్మ కన్న మమకారం విడువలేక రంగారెడ్డి పాదాలపైపడి 'ఏమండీ! మనకు ఒక్కగా నొక్క కూతురు. నా ఆశలన్నీ దానిమీదే పెట్టుకున్నాను. అమ్మాయి లేకపోతే నేను బ్రతకలేను. అమ్మాయి ఎక్కడుందో వెతికించండి.

బహుశా ఆ రఘు దగ్గరకే వెళ్ళివుంటుంది. వెళ్ళి ఆ రామయ్యగార్ని కనుక్కోండి' అంటుంది. 'ఆ రామయ్య దగ్గరకి నేను ఏ ముఖం పెట్టుకొని వెళ్ళను.' అంటాడు రంగారెడ్డి.

'మన అమ్మాయికోసం యేపనైనా చేయాలి-వెళ్ళండి అతన్ని బ్రతిమాలండి. ఈ పని మీరు చేయాలి-తప్పదు.' అంది పార్వతమ్మ. రంగారెడ్డి భార్య దుఃఖము చూడలేక 'సరే అలాగే వెళ్ళివస్తా'నని చెప్పి - ఫుల్లడిని పిలచి 'ఒరే! ఫుల్లా రాత్రికి గూడుబండి సిద్ధం చేయరా. రామయ్యగారింటికి పోయివద్దాం' అన్నాడు. భోజనాలు ముగిసినపిమ్మట రంగారెడ్డి ఫుల్లడు యిద్దరు రామయ్యగారింటికి చేరుకుంటారు. ఫుల్లడు బండిదిగి రామయ్యగారి యింటి తలుపు తడతాడు. అప్పుడు తెల్లవారుజాము నాలుగుగంట లవుతుంది. అప్పుడే పూజలకని లేచిన రామయ్య బయట తలుపు తట్టిన చప్పుడు విని తలుపు తీస్తాడు. తలుపు తెరచి ఎదురుగా ఫుల్లడినిచూచి నిర్ఘాంతపోయి' ఏం? 'ఫుల్లా యిలావచ్చావ్' అంటాడు. ఫుల్లడు 'బాబుగారూ దండాలండి రంగారెడ్డిగారు మీతో ఏదో మాట్లాడాలని వచ్చేరు' అన్నాడు వినయంగా

ఆ మాటలువిన్న రామయ్య 'మేమిక్కడ యిలా బ్రతకడంకూడ ఆయనకి యిష్టం లేదా ఏం? ఫుల్లా' అన్నాడు.

అంతలో రంగారెడ్డి లోనికి ప్రవేశించి రామయ్య చేతులు పట్టుకుని 'నాతప్పులు మన్నించండి రామయ్యగారూ' అన్నాడు.

'నాబోటి దరిద్రుడు మీబోటి ప్రభువులను మన్నించడమా!' అన్నాడు రామయ్య.

'లేదు రామయ్యగారు ముందు నేను చేసినవన్నీ మీరు మరచిపోవాలి' అన్నాడు రంగారెడ్డి.

'ఇప్పుడా? వూరు విడచినప్పుడే అవన్నీ నేను మరచిపోయాను. ఏదో జరిగిపోయిందేదో జరిగిపోయింది. ఇప్పు డవన్నీ యెందుకు' అన్నాడు రామయ్య.

ఇద్దరూ కూర్చుని కాసేపు మాట్లాడు కున్నారు. మాటల సందట్లో రంగారెడ్డి 'మీ అబ్బాయి రఘు ఏడీ' అని అడిగాడు.

'మేమీ గ్రామానికి వచ్చిన కొన్నాళ్ళకే రఘుకి మద్రాసులో వుద్యోగం అయింది. ఇప్పుడక్కడే వుంటున్నాడు' అన్నాడు రామయ్య.

'ఏదో ఎక్కడైనా కులాసగ వుంటే చాలు మరల తిరిగి యెప్పుడొస్తాడు' అన్నాడు రంగారెడ్డి.

'ఏమో అక్కడ ఏంచేస్తున్నాడో వెళ్ళి చాలరోజులైంది-ఎప్పుడొచ్చేది తెలియదు' అన్నాడు రామయ్య.

'అవునవును - అసలే అది మద్రాసు అక్కడికెళ్తే తిరిగిరా బుద్ధవుతుందా? పట్నాలలో వుండవలసిన కుర్రకుంకలు యిక్కడ వుండమంటే వుంటారా? పైగా రఘు అక్కడ వుద్యోగం చేస్తున్నాడాయె ఆ.., అన్నట్లు... అబ్బాయి యడ్రసు ఏమైనా తెలుసా' అని అడిగేడు రంగారెడ్డి.

రంగారెడ్డి మాటలకు కాస్త అనుమానపడి 'ఆ... మీకెందుకులెండి వాడి యడ్రసు ఎప్పుడో వచ్చినప్పుడు వాడే వస్తాడు.' అన్నాడు రామయ్య.

అబ్బే అది కాదు ఈమధ్య నేను పనిమీద మద్రాసు వెళుతున్నాను. మనవాడు అక్కడ వున్నాడు కనుక నాకు కాస్త బసచేసేదానికి సౌకర్యా లుంటాయని గాని

మరేం లేదు. నేను మద్రాసు వెళ్ళడం యిదే మొదటి సారి. కనుక, రఘు అడ్రసు యివ్వండి' అని నైపుణ్యముగా అడిగేడు రెడ్డి. కాని అసలువిషయం బయటపెట్టడు.

అడ్రసు యిచ్చినంతమాత్రాన యేం జరుగుతుందిలే అని అనుకుంటూ మరోప్రక్క అనుమానంతో చేసేది ఏమిలేక రఘు అడ్రసు చెప్తాడు రామయ్య.

రఘు అడ్రసు తీసుకొని కొంతసేపు రామయ్యతో మాట్లాడి సెలవు తీసికొని మధ్యాహ్నంకల్లా ఎఱ్ఱబాళెం చేరుకుంటాడు రంగారెడ్డి.

రంగారెడ్డిగారికై పార్వతమ్మ - చంద్రమ్మ ఎదురు చూస్తుంటారు. బండి చప్పుడు వినగానే 'అదిగో చంద్రమ్మా అమ్మాయి వచ్చింది' అంటుంది ఆత్రంతో పార్వతమ్మ సావిత్రితో రంగడు కూడ వచ్చాడని చంద్రమ్మ బండిదగ్గరకు పోయిచూస్తుంది.

రంగారెడ్డి ఒక్కడే బండిదిగడంచూసి పార్వతమ్మ 'అమ్మాయేది'? అంటుంది.

రంగారెడ్డి 'యింకెడి అమ్మాయి ఎక్కడో ఏకాకిగా వున్న చిలకతో జోడు కలిసి వెళ్ళియుంటుంది. నన్నేం చేయమంటావు' అన్నాడు.

పార్వతమ్మ దుఃఖం ఆపుకోలేక ఏడుస్తుంటుంది. చంద్రమ్మ తన ముద్దులకొడుకు కనిపించలేదని ఏడుస్తుంది. అప్పటివరకు దాగినగుట్టు వీరి ఏడుపులతో ఇరుగు పొరుగులకు తెలుస్తుంది. ఎన్నాళ్ళు దాగుతుంది? రంకుతనం, దొంగతనం. సావిత్రి ఎక్కడికో లేచిపోయిందని గుసగుసలు బయలుదేరతాయి.

మరుసటిదినము సావిత్రి మద్రాసునుండి తల్లికి రహస్యంగా జాబు వ్రాస్తుంది. కుమార్తె వ్రాసిన జాబు భర్తకు చూపించి 'నాచిట్టితల్లి క్షేమంగా వుంది. అంతే చాలు మనం వెళ్ళిచూద్దామండి. ఎడ్రసు కూడ వ్రాసిందిగా' అంటుంది పార్వతమ్మ.

రంగారెడ్డి భార్యతో మద్రాసుకు ప్రయాణమవుతాడు. పుల్లడిని పిలచి 'ఒరే పుల్లా మేము మద్రాసు వెళ్ళివస్తాము. నీవు, చంద్రమ్మ యింటిదగ్గర జాగ్రత్తగా వుండండి' అనిచెప్పి పార్వతమ్మతో సహా మద్రాసువెళ్ళి అక్కడ రఘు వున్నయింటికి వెళ్తాడు. బయట టేక్సీ కారు చప్పుడువిని సావిత్రి వులికిపడిలేచి 'రంగా బాబుగారు క్యాంపునుండి తిరిగివచ్చినట్టున్నారుచూడు' అంది.

అప్పటికి రఘు క్యాంపుకి వెళ్ళి నాలుగురోజులైంది.

రంగడు గబగబ బైటికివచ్చి రెడ్డిగారిని, పార్వతమ్మనుచూసి గుర్తించి, నిర్ఘాంతపోయి అలాగే చూస్తుంటాడు. రంగారెడ్డి రంగడిని గుర్తుపట్టలేకపోతాడు. 'ఏం అబ్బాయి రఘుగారి యిల్లు యిదేనా?' అని అడుగుతాడు.

'అవునండి లోపలికి దయచేయండి' అంటాడు రంగడు.

రఘు వస్తున్నాడేమో అని ఎదురుచూస్తున్న సావిత్రి తల్లిదండ్రులను చూసి భయంతో నిలువున నీరైపోతుంది. పార్వతమ్మ సావిత్రి దగ్గరకువెళ్ళి 'నాచిట్టితల్లీ' అని కౌగలించుకుంటుంది.

సావిత్రి-మౌనంగా నిలబడిన తండ్రివద్దకువెళ్ళి కాళ్ళమీదపడి 'నన్ను క్షమించండి నాన్నగారూ!' అంటుంది.

(తరువాయి 25 వ పేజీలో)



(6 వ పేజీ తరువాయి)

రంగారెడ్డి కోపం అంతా కూతురును చూడగానే మాయమైపోయింది. 'నీదేం తప్పు లేదమ్మా! తప్పంతా నాదే అంటాడు.

అంతలో రంగడు 'అయ్యగోరూ! భోజనానికి లేవండి చాలా ఆలస్యం అయింది' అంటాడు. రంగారెడ్డి రంగడి వైపు విచిత్రంగా చూస్తూ 'అమ్మాయి! వీడు మన చంద్రమ్మ కొడుకు కాదూ' అంటాడు.

'అవును నాన్నా' అన్నది సావిత్రి.

'ఓరి నీపాసుకాల! ఎంతలో ఎలా మారిపోయావురా! నీకు మద్రాసు నీళ్ళు పడ్డట్టున్నాయి' అన్నాడు.

రంగడు తల గోక్కుంటూ 'అంతా మన చిన అమ్మగారి చలువదొరోరూ! అన్నాడు.

తరువాత అంతా భోజనాలు ముగించి మాటల్లోకి దిగేరు. సావిత్రి తల్లిదండ్రులకు అన్నిసంగతులు వివరంగా చెపుతుంది.

'రఘు ఎక్కడికి వెళ్ళాడు? ఎప్పుడు వస్తాడు' అన్ని ప్రశ్నించాడు రంగారెడ్డి.

'ఆయన క్యాంపుకి వెళ్ళి నాలుగురోజులైంది వస్తే యివాళ సాయంత్రానికల్లా రావచ్చు' అంటుంది.

సాయంత్రం ఆరుగంటలకు రఘు యింటికి వస్తాడు. ఇంట్లో రంగారెడ్డిగార్ని చూసి నిర్ఘాంతపోయాడు. సావిత్రి రఘు కోటువిప్పి స్టేండుకు తగిలించి' యింకా అలా నిలబడ్డారేం' అంటుంది.

'ఆహా ఏంలేదు' అంటూ స్నానం భోజనం ముగించుకొని రంగారెడ్డిగారిదగ్గర కొస్తాడు.

రంగారెడ్డి 'రా నాయనా కూర్చో' అని కుర్చీ చూపెడతాడు.

రఘు కుర్చీలో కూర్చుంటూ 'మీరెప్పుడొచ్చేరు? అంతా క్షేమమేకదా' అని అడిగేడు.

'మేము వుదయం వచ్చాం. మావలన ఏమైనా తప్పు వుంటే మన్నించు నాయనా!' అన్నాడు రంగారెడ్డి.

'పెద్దవారు మీవలన తప్పులేమి వుంటాయి మావలన తప్పులేమైనవుంటే మీరే మన్నించండి' అన్నాడు రఘు.

'అదిసరేగాని ఏదో అమ్మాయి వచ్చేసింది అందుకనే వచ్చాం. మా అమ్మాయిని తీసుకొని వెళ్తాం' అన్నాడు రంగారెడ్డి.

రఘుకి నోటమాటరాక అలానే కూర్చుండిపోయాడు.

'ఏం రఘూ ఏమాలోచిస్తున్నావ్'' అన్నాడు మరల రంగారెడ్డి.

రఘు బిత్తరిచూపులతో సావిత్రివైపుచూసి 'అది నా యిష్టం కాదు. మీ అమ్మాయిని నేను తీసికొనిరాలేదు. ఆమె యిష్టం. ఆమె వచ్చేటట్టయితే తీసికెళ్ళండి నా కభ్యంతరం లేదు' అన్నాడు యుక్తిగా

అంతలో సావిత్రి తండ్రి దగ్గరకొచ్చి

'ఆయనను విడచి నేను వుండలేను నాన్నా ఇక తల్లి, తండ్రి, దైవం, భర్త అన్నీ వారే నేనాయనను విడచి రాలేను' అంది.

పార్వతమ్మ కూతురు మాటల కొప్పుకొని 'అప్పుడప్పుడు వచ్చిచూచి వెళ్ళ'మంది. సావిత్రి సరే నంది.

మర్నాడు పార్వతమ్మ రంగారెడ్డి వూరికి ప్రయాణమైనారు. రఘు వారిని స్టేషనువరకు సాగనంపి సంతోషంగా తిరిగి యిల్లు చేరుకున్నాడు.

కొన్నాళ్ళు గడిచింది. ఇప్పుడు రంగడుకూడ యుక్తవయస్సులోనికి వచ్చాడు. బాగా పెరిగాడు. రఘుకి రంగడిమీద అమితప్రేమ, నమ్మకం కలిగింది. పదిహేనేండ్ల కుఱ్ఱవాడిని పెంచి పెద్దచేసాడు. అందుకని రంగడిని తన స్వంత అన్నతమ్మునిలా చూసుకొనేవాడు.

ఒకనాడు రఘు ఇంట్లో లేనిసమయంలో రామ్, శ్యామ్ - యిద్దరు రఘు స్నేహితులు జల్సాగ రఘు యింటికి వచ్చారు.

అంతలో రంగడు బయటకువచ్చిచూచి ఎవ్వరో వచ్చారని లోనికి పరుగెత్తి సావిత్రితో 'ఎవరో మన బాబుగారికోసం వచ్చారమ్మా అని చెప్పేడు.

'వారిని లోనికి తీసికునిరా బాబుగారు లేనిసమయంలో మనమే వారికి మర్యాదలు చెయ్యాల అన్నది' సావిత్రి.

రంగడు వారిని లోనికి పిలచి కుర్చీలు చూపించి వారిని కూర్చోమని వారికి కాఫీ బిస్కట్లు ఇచ్చి మర్యాద చేస్తాడు.

వారు కుర్చీలలో దర్జాగా కూర్చొని కాఫి త్రాగుతూ సావిత్రినికూడ వచ్చి కూర్చోమని సౌంజ్ఞ చేసారు.

బలవత్తర హిందూ నిబంధనాలకు మాత్రమే అలవాటైన - సావిత్రికి అది వింతగా తోచింది. తాను కూర్చొనక-రంగడిచేతనే అన్నిమర్యాదలు జరిపించింది.

కాఫీలు ముగించి వారిద్దరు 'యిక మేము వెళ్ళొస్తాము. రఘు వస్తే మేము వచ్చినట్లు చెప్పండి' అని వీధిలో కడుగులు వేసేరు. వారివింతమనస్సుల్లో విచిత్రపు వూహలు బయలుదేరాయి. తమ ఆహ్వానాన్ని అందుకొనక - సావిత్రి కాఫీ పార్టీలో పాల్గొనలేదని అంతటి ముద్దరాలను-జవరాలిని ప్రక్కన కూర్చోపెట్టుకోలేకపోయినందుకు బాధపడి కసిగా వరండాలోనికి తొంగి తొంగి చూసి కారు చేరుకొని స్టార్టు చేసారు.

అంతలో రఘు వచ్చాడు.

'ఏమండీ! యిందాక మీస్నేహితులిద్దరు వచ్చారు' మిమ్మల్ని అడిగి పోయారు' అన్నది.

'నాబదులు నీవు మాట్లాడి వారికి మర్యాదచేసి పంపలేకపోయావా?' అన్నాడు రఘు.

'మన రంగడు వారికన్నిమర్యాదలు చేసాడు. సరే కాని పరాయి మగాళ్ళతో నన్నెలా మాట్లాడమన్నారండి' అన్నది సావిత్రి.

'నీవు ఆపల్లెటూరిచేష్టలన్నీ యిక్కడ విడిచిపెట్టాలి' అని సావిత్రికి చెక్కిలిగింతలు పెట్టాడు.

సావిత్రి కిలకిలా నవ్వుతుంది.

ఆసాయంత్రం రఘు, సావిత్రి, రంగడు మెరీనా బీచికి వెళ్ళాలని అనుకుంటారు. సావిత్రి రఘు తెచ్చిన క్రొత్త బట్టలు ధరిస్తుంది. తలనిండా పువ్వులు పెట్టుకుంటుంది. రంగడుకూడ క్రొత్తబట్టలు వేసుకుని బాగా ముస్తాబవుతారు.

(సశేషం)

'కథాంజలి'లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితము. ఎవరిని ఉద్దేశించి వ్రాసినదికాదు. రచయితల రచనలకు మేము ఏ మాత్రమూ బాధ్యులుకాము.

—సంపాదకుడు

